

2లో..

## అంబేద్కర్ ఆశయాలను ఖూని చేసిన కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 006
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
డిసెంబర్ 06, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# పాత బస్తీలో.. గంజాయి గ్యాంగ్స్

- రెచ్చిపోతున్న యువత
- పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో అడ్డాలు
- త్రిపుల్ రైడింగ్ తో హల్ చల్
- బాలికలతో అసభ్య ప్రవర్తన
- ప్రశ్నించిన వారిపై దాడులు
- అంతం చేస్తామంటూ బెదిరింపులు
- విద్యార్థులకు రక్షణ కరువైందంటున్న తల్లిదండ్రులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

పాతబస్తీగా పేరుగడించిన అండర్ రైల్వే గేటు ప్రాంతంలో గంజాయి గ్యాంగ్స్ రెచ్చిపోతున్నాయి. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో అడ్డాలువేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. విద్యార్థులు ఉండే ప్రాంతాల్లో ఓవర్ స్పీడ్ నిషేధమైనప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా త్రిపుల్ రైడింగ్ చేస్తూ రెట్టించిన వేగంతో దూసుకుపోతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైనే దాడులు చేస్తూ అంతం చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. నిత్యం గంజాయి మత్తులో తూలుతూ పాఠశాలల పరిసర ప్రాంతాల్లోని దుకాణాల్లో సిగరెట్లు కొనుగోలు చేసి హీరోల్లా ఫోజులిస్తూ గుప్పుగుప్పుమంటూ సిగరెట్ పొగను వదులుతున్నారు. ఒక్కో దుకాణం పరిసరాల్లో ఐదారుగురు గ్యాంగ్ లాగా నిలబడి ఇంటికిపోయే విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. తోటి విద్యార్థినులకు ఎవరైనా అండగా నిలిస్తే మొదలు వీడి సంగతి చూడండ్రా అంటూ మూకుమ్మడిగా సదరు విద్యార్థిపై దాడి చేసి గాయాలపాలు చేస్తున్నారు. ఇటీవల శిరంగి రాజా రాంతోటలోని ఓ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిపై గంజాయి గ్యాంగ్ దాడిచేయగా వారి తల్లిదండ్రులు మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు పాఠశాల యాజమాన్యం సైతం గంజాయి గ్యాంగ్ పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్ఆర్ఆర్ తోటలోని గంజాయి విక్రయ దారులనుంచి పెద్ద మొత్తంలో పోలీసులకు ముడుపులు అందుతున్నందునే వారు స్పందించడంలేదని విద్యార్థులు పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. పోలీసులు గంజాయి గ్యాంగులతో, విక్రయ దారుల ఆట కట్టించకపోతే జిల్లా పోలీస్ బాస్ లకు ఫిర్యాదు చేస్తామంటున్నారు. పోలీసుల ఉదాసీనతే వారు రెచ్చిపోవడానికి కారణంగా మారుతోందంటున్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి





# మంత్రి సీతక్క స్వగ్రామంలో ఏకగ్రీవం

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సొంత ఊరు ములుగు మండలం జగ్గన్నపేట గ్రామం సర్పంచిగా ఆరెం వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంత్రి సీతక్క చొరవతో జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడు పల్లెలను ఒక్కతాటి మీదకు తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థి ఆరెం వెంకన్న ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా కృషి చేశారు. మాజీ మంత్రి స్వర్గీయ అజ్మీరా చందూలాల్ అనుచరులకు ఉప సర్పంచ్ పదవిని ఏకగ్రీవంగా కేటాయించారు. తమ స్వగ్రామంలో గ్రామ సర్పంచి ఎన్నిక ఏకగ్రీవంగా కావడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి నిత్యం కృషి చేస్తానని సీతక్క హామీ ఇచ్చారు.

- వరంగల్ వాయిస్, ములుగు

## సామాజిక తెలంగాణే లక్ష్యంగా అడుగులు



2లో..

- అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కృషి
- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

8లో..



## ఐజేయూ నేతలకు ఘన సత్కారం

సత్కరించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు



# సామాజిక తెలంగాణే లక్ష్యంగా అడుగులు

- **అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కృషి**
- **అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, సామాజిక తెలంగాణే లక్ష్యంగా అడుగులు వేస్తోందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం బాబాసాహెబ్ వర్ధంతి సందర్భంగా కాశిబుగ్గలోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగ అవకాశం, సమాన హక్కులు అందరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత అంబేడ్కర్ ఆలోచనలను తెలుసుకుని, ఆయన చూపించిన విద్యాసాధన మార్గాన్ని అనుసరించి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి పౌరుడికి అధికారం, హక్కులు కలిగేలా చేసిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన చూపించిన మార్గం తమ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. పేద, బలహీన వర్గాల అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటికి విద్య, ఆరోగ్యం, ఉపాధి అందేలా కృషి చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి తెలిపారు. భారత రాజ్యాంగ శిల్పిగా, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పోరాడిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సేవలు అపారమని అన్నారు. సమాజంలో విద్యా, అవగాహన, హక్కుల గురించి ప్రజలకు అంబేడ్కర్ అందించిన ప్రేరణ నేటికీ మార్గదర్శకమని చెప్పారు. బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంకల్పబద్ధంగా పనిచేస్తుందన్నారు. అంబేడ్కర్ కలలుగన్న సమసమాజ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను ఖూని చేసిన కాంగ్రెస్

☐ **బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం కూని చేస్తోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆరోపించారు. భారత దేశ భాగ్య విధాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహానుభావుడికి వినమ్ర నివాళులర్పించారు. వరంగల్ జిల్లా పరిధిలోని శివనగర్, చింతా నెక్కొండ, అన్నారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏనాడూ అంబేద్కర్ ను పట్టించుకోలేదన్నారు. అంబేద్కర్ కు భారత రత్న అవార్డు ప్రకటించింది బీజేపీ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. రాబోయే తరాలకు స్ఫూర్తిగా ఉండేలా అంబేద్కర్ పేరిట స్ఫూర్తి భవనాలు నిర్మించామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దళిత ద్రోహి ఏలుతున్నాడని విమర్శించారు. పేదల పాలిట యముడిలా తయారైండు. ఎన్నికల సమయంలో జై భీమ్, జై దళితులు అని, ఎన్నికల తర్వాత దళితులను పట్టించుకోని రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు తమకు కావాల్సిన విధంగా రాజ్యాంగాన్ని పలుమార్లు మార్పులు చేసి ఈరోజు రాజ్యాంగాన్ని కూని చేస్తున్నారన్నారు. మనది విభిన్నమైన సంస్కృతి అన్నారు. ప్రత్యేకమైన రాజ్యాంగాన్ని రూపుదిద్దిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ ఒక్కటే అన్నారు. ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు.

# ఈశ్వర చారి బలిదానంతోనైనా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

☐ **విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకుల డిమాండ్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారనే ఆవేదనతో మనస్థాపం చెందిన విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ సాయి ఈశ్వరచారి ఆత్మ బలిదానం చేసుకోవడం బాధాకరమని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర బాధ్యులు పెండోట చక్రపాణి, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, జక్కోజు కోటేశ్వర్ రావులు ఆవేదన వ్యక్తం చేసారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసిన సాయి ఈశ్వరా చారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో టైలర్ స్ట్రీట్ లో సంఘ ఉపాధ్యక్షులు కొత్తగట్టు వీరబ్రహ్మాచారి అధ్యక్షతన నివాళులు అర్పించారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ శ్రీకాంతాచారి ప్రాణ త్యాగం చేసుకోగా నేడు బీసీ రిజర్వేశన్ల కోసం మరో విశ్వబ్రాహ్మణ ముద్దు బిడ్డ సాయి ఈశ్వర చారి బలిదానం చేసుకోవడం బాధాకరమన్నారు. సాయి ఈశ్వర చారి బలిదానంతోనైనా ప్రభుత్వాలు కండ్లు తెరిచి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరాచారి మృతికి కాంగ్రెస్, బీజేపీలే నైతిక బాధ్యత వహించాలన్నారు. సాయి ఈశ్వరాచారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కటుకోజ్వల సత్యనారాయణ, జక్కోజు కోటేశ్వర్ రావు, స్వర్ణకార సంఘం నాయకులు, కార్యకర్తలు పానుగంటి రవీందర్, ఆసం రవి, మధు, శ్రీను, శ్రీధర్, మనోజ్ కుమార్, శ్రీనివాస్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మా ఉసురు తగిలింది..

- **అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి బాధితుల సంబురాలు**
- **హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బాణా సంచా పేల్చిన రైతులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తమ భూములకు సరైన పరిహారం అందజేయకుండా అడ్డుకున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి మా ఉసురు తగిలిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం జిల్లాలోని దామెరకు చెందిన నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి రైతులను అనేక ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. భూ పరిహారం విషయంలో తమ వినతిని కనీసం పట్టించుకోలేదన్నారు. ఇన్ని రోజులకు తమ ఉసురు తగిలిందని గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులు పేర్కొన్నారు. ఇలాంటి అవినీతి అధికారులు ఉండడం సమాజానికి మంచిది కాదన్నారు. అదనపు కలెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఈ రకమైన అవినీతికి పాల్పడుతూ ఏసీబీ అధికారులకు పట్టుబడడం సహించరాని నేరం అన్నారు.



# చిన్న జీయర్ స్వామికి.. శ్రీ గోవిందరాజ స్వామి శేష వస్త్రాలు

☐ **పోస్టల్ కాలనీకి విచ్చేసిన స్వామి**

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** హనుమకొండలోని పోస్టల్ కాలనీ వాస్తవ్యులు తిరుమలరెడ్డి స్వగృహమందు శ్రీ రామానుజ చిన్న జీయర్ స్వామి శనివారం ఉదయం 10 గంటలకు విచ్చేశారు. దీంతో వరంగల్ ఉమ్మడి జిల్లా వికాస తరంగిణి అధ్యక్షులు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ గోవిందరాజస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి, గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు వరయోగుల లక్ష్మణస్వామి, వరయోగుల ప్రసాద స్వామి, దుర్గేశ్వర స్వామి ఆలయ అర్చకులు కొత్తపల్లి నిఖిలేశ్వర్, అడ్వకేట్ ఓడపెల్లి శ్యామ్ కృష్ణ, భక్తులతో వెళ్లి శ్రీ గోవిందరాజ స్వామి శేష వస్త్రము, ప్రసాదాలను చిన్న జీయర్ స్వామికి అందజేశారు. తదనంతరం వరంగల్ నగరంలో చారిత్రాత్మకమైన, అతి పురాతనమైన శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయాన్ని సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు. వీరి అభ్యర్ధన మేరకు ధనుర్మాసంలో తప్పకుండా గోవిందరాజస్వామి దర్శనమునకు విచ్చేస్తానని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలంటూ సూచించినట్లు వరయోగుల శ్రీనివాస స్వామి వెల్లడించారు.

# బస్సులో పోయిన సర్టిఫికెట్స్

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** బస్సులో బీటెక్ విద్యార్థి సర్టిఫికెట్స్ పోగొట్టుకున్నాడు. విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రానికి చెందిన మార్త మధుసూదన్–మాధవి దంపతుల కుమారుడు రశ్వంత్ వరంగల్ నిట్ లో బీటెక్ మెకానికల్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. నవంబర్ 16వ తేదీన హనుమకొండ జిల్లా పరకాల నుంచి ఆర్టీసీ బస్సులో కొత్తపల్లి గోరికి వెళ్తుండగా బీటెక్ రెండో సంవత్సరం ఆడ్ సెమ్ (2–1) సర్టిఫికెట్ పోయింది. (సర్టిఫికెట్ రోల్ నెంబర్ 22ME–BOB40,ఎన్ఐటీడబ్ల్యూ) దొరికినవారు రశ్వంత్ సెల్ నెంబర్ 8142902190 లో సంప్రదించాలని కోరారు.

# బీసీ రిజర్వేషన్లకై సాయి ఈశ్వర చారి ఆత్మబలిదానం

- ఆ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- బీసీ నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన సాయి ఈశ్వర చారి పార్థివ దేహానికి మాజీ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్, తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్ సహా పలువురు బీసీ నాయకులు నివాళులర్పించారు. బీసీ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని తృణప్రాయంగా వదిలి అమరుడైన ఈశ్వర చారి త్యాగం వృథా కాకూడదని వారు శపథం చేశారు. బీసీలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌ను నమ్మి బీసీలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినా, ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం, అది కోర్టులో ప్రతిఘటించబడటం, తద్వారా రిజర్వేషన్లు దక్కకుండానే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం ముందడుగు వేయడాన్ని చూసి ఈశ్వర చారి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ తీవ్ర నిరాశతోనే ఆయన పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒక పేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన సాయి ఈశ్వర చారికి భార్య, ఒక కుమారుడు (4 ఏళ్లు), ఇద్దరు కుమార్తెలు (1, 3 ఏళ్లు) ఉన్నారు. ఈ పసిపిల్లల భవిష్యత్తు అంధకారంగా మారడాన్ని చూసి అక్కడికొచ్చిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. సాయి ఈశ్వర చారి మరణం పూర్తిగా ప్రభుత్వ హత్యేనని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘంతో సంప్రదించి రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలి. బీసీలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్లు సాధించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి వెంటనే రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం, సొంత ఇల్లు మంజూరు చేయాలి. ఏ పార్టీలో ఉన్నా, బీసీ ప్రజాప్రతినిధులు (ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యే) వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి, బీసీ ఉద్యమాన్ని ముందుండి నడపాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుసికొండ ఓంకార్, స్వర్ణకారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పానుగంటి శ్రీధర్, కేయూ జాక్ కన్వీనర్ కత్తెరపల్లి దామోదర్, మహేందర్ సహా వివిధ రాజకీయ పార్టీల బీసీ నాయకులు, సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శుభ్రతతో పాటు పచ్చదనం కూడా అవసరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ రైల్వే నిర్వహిస్తున్న "స్వచ్ఛతా పక్వాడా" (శుభ్రత పాక్షికం) కార్యక్రమాన్ని పురస్కరించుకుని వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక శుభ్రత, పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే సిబ్బంది ప్రత్యేక ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు సిద్ధం నరేష్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్ధం నరేష్ పటేల్ స్వయంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "స్వచ్ఛతా పక్వాడా" అనేది శుభ్రతను దినచర్యలో భాగం చేసే జాతీయ స్థాయి ఉద్యమం అన్నారు. శుభ్రత, ఆరోగ్య రక్షణ సమాజానికి అత్యంత కీలకం. రైల్వే స్టేషన్లు, రైళ్లు నిత్యం వేలాది మంది ఉపయోగించే ప్రదేశాలు కాబట్టి, ఈ ప్రాంతాలు శుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఉద్ఘాటించారు. పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారిస్తూ.. "శుభ్రతతో పాటు పచ్చదనం కూడా మన సమాజానికి అవసరం. నేడు నాటే ఒక మొక్క రేపటి తరాలకు జీవితాన్ని అందిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో పచ్చదనం పెంచాలి" అని పిలుపునిచ్చారు. 'స్వచ్ఛతా పక్వాడా' విజయవంతం కావడానికి రైల్వే ఉద్యోగులు నిరంతరం చేస్తున్న కృషిని సిద్ధం నరేష్ పటేల్ అభినందించారు. రైల్వే ప్రాంగణం మన అందరిది. ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో పాల్గొని, వరంగల్‌ను శుభ్రంగా, పచ్చగా మార్చేందుకు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి నాగరాజు, రత్న కృష్ణ కిషోర్, ప్రణీత్ వర్మ, మేకల ప్రవీణ్, పల్లకొండ డేవిడ్, రావత్ అఖిల్, కేశపాక తరుణ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి:** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలోనే గ్రామాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, ములుకలపల్లి, పిడిసిల్ల గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్స్‌లో ఎమ్మెల్యే ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామని, రాబోయే రోజుల్లో గ్రామాల రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని కాంగ్రెస్ శ్రేణులు పాత, కొత్త అనే తేడా లేకుండా.. అంతా ఒక్కతాటిపైకి వచ్చి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సూచించారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి వాడను, ప్రతి గల్లీని అభివృద్ధి చేసే విషయంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం 31వ డివిజన్, హంటర్ రోడ్ మహీంద్ర షోరూం వద్దగల కాలనీలో సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా ఈ వాడలకు వచ్చి ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ప్రజాపాలనలో అభివృద్ధి విషయంలో తాము అలాంటి నిర్లక్ష్యం చేయమని, దానికి ఈ రోజు రూ. 40 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే సాక్ష్యం అని అన్నారు. ప్రతి రోజు అభివృద్ధిలో భాగస్వామ్యం కావడమే తమ దినచర్య అని తెలియజేశారు. కాలనీ ప్రజలందరూ సహకరించి, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. డివిజన్ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# హామీ మరిచారు.. వరద సాయం అందించలేదు

## 11న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

## కార్పొరేటర్ మరుపల్ల రవి పిలుపు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అక్టోబర్ మాసంలో కురిసిన విపరీత వర్షాల కారణంగా నష్టపోయిన లోతట్టు ప్రాంతాల వరద బాధితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ఆర్థిక సాయం 38 రోజులు గడుస్తున్నా అందలేదని 40వ డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకులు మరుపల్ల రవి తీవ్రంగా విమర్శించారు. శనివారం ఉర్సు ప్రతాప్ నగర్‌లో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వరంగల్ పర్యటన సందర్భంగా సీఎం ప్రకటించిన రూ.15,000 ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు ఏ ఒక్క లబ్ధిదారునికి దక్కలేదన్నారు. అక్టోబర్ వర్షాల వల్ల డీకే నగర్, కొత్త కుమ్మరివాడ, ఉప్పరోనిలోని ఇళ్లన్నీ నీట మునిగి, ఫర్నిచర్ వస్తువులు పాడైపోయాయని, కొన్ని కొట్టుకుపోయాయని తెలిపారు. గత సంవత్సరం కురిసిన విపరీత వర్షం వల్ల కూడా డీకే నగర్‌లోని ఇళ్లు మునిగిపోయాయని, అప్పుడే రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించినా ఇంతవరకు ఒక్క రూపాయి సాయం కూడా అందలేదని కార్పొరేటర్ గుర్తు చేశారు. ఈసారి కూడా ఖిలా వరంగల్ మండల రెవెన్యూ అధికారులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించినా, ఇంతవరకు సాయం అందకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన అమలు జరుగుటకు జిల్లా మంత్రి కొండా సురేఖ, అధికారులు చొరవ చూపాలని మరుపల్ల రవి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబర్ 11న ఖిలా వరంగల్ మండల రెవెన్యూ కార్యాలయం (ఎంఆర్ఓ) ముందు ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ వనం కుమార్, నాయకులు కుండే రాజు, మరుపల్ల గౌతం, శెట్టి మోహన్, గజ్జి సాంబయ్య, టం టం నరసింహ, దాసరి రాజు, గుళ్ళపల్లి కర్ణ, ఆవునూరు సునీత, నాంపల్లి మంజుల, కళ్యాణపు వెంకటేశ్వర్లు, చీర రమేష్, అన్న శ్రీనివాస్, చింతపట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపరులను కఠినంగా శిక్షించాలి

◆ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్



**వరంగల్ వాయిస్, సుబేదారి:** ప్రభుత్వ కార్యాలయాల్లో లంచగొండితనానికి పాల్పడుతున్న అవినీతి అధికారులను కేవలం సస్పెండ్ చేయడమే కాకుండా, ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించాలని (డిస్మిస్) ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుబేదారిలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారి పాఠశాల అనుమతుల రెన్యువల్ కోసం రూ.60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడటం సిగ్గుచేటన్నారు. జిల్లాలో అత్యున్నత కార్యాలయమైన కలెక్టరేట్‌లోనే కీలక అధికారి అవినీతికి పాల్పడటం చూస్తుంటే.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చని శేషు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, సివిల్ సప్లై, పోలీస్ శాఖల్లో ఏసీబీ దాడులు జరుగుతున్నా, కోట్లాది రూపాయల అక్రమాస్తులు బయటపడుతున్నా.. మార్పు రాకపోవడం గమనార్హమన్నారు. పాలకులు, అధికారుల అవినీతి దాహానికి సామాన్య ప్రజలు బలైపోతున్నారని అన్నారు. అవినీతికి పాల్పడిన వారిని నామమాత్రంగా సస్పెండ్ చేసి చేతులు దులుపుకోకుండా, వారిని డిస్మిస్ చేసేలా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా చట్టాలు చేయడానికి పాలకులు భయపడుతున్నారని, చిత్తశుద్ధితో వ్యవహరించి కఠిన చట్టాలను రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నరేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అన్ని దానాల్లోకెల్లా అన్నదానం అత్యంత గొప్పదని వరంగల్ ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ లయన్ కొంగ మోహన్ అన్నారు. శనివారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్‌లోని స్పందన దివ్యాంగుల కేంద్రంలో ఆయన మనువరాలు కొంగ మహాశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్ కొంగ మోహన్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దివ్యాంగులను సమాజంలో చిన్నచూపు చూడకూడదని, వారిని గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ కార్యదర్శి వివేకానంద, పూర్వ అధ్యక్షులు జి.సత్యనారాయణ రావు, లయన్ ఇమ్మడి కృష్ణమూర్తి, స్పందన దివ్యాంగుల కేంద్రం నిర్వాహకులు సుచరిత రెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్ అంబేద్కర్ కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను వడ్డేపల్లి దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి రవీందర్ ఆధ్వర్యంలో శనివారం వడ్డేపల్లిలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, వడ్డేపల్లి దళిత సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి ప్రవీణ్ కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం, కాంగ్రెస్ పార్టీ 58వ డివిజన్ అధ్యక్షుడు తాళ్ల పెల్లి సుధాకర్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాళ్ల పెల్లి మేరీ, చీఫ్ అడ్వైజర్ తాళ్ల పెల్లి ప్రభాకర్, శనిగరపు అనిత, తాళ్ల పెల్లి శ్రీను, ఆండాళ్ రాజ్, అనిల్ చంద్, తాళ్ల పెల్లి చార్లెస్, తాళ్ల పెల్లి జయపాల్, తాళ్ల పెల్లి ప్రదీప్, బోస్, నల్ల ప్రభు కుమార్, మాచర్ల చేరాలు, ఇల్లందుల భాస్కర్, తాళ్ల పెల్లి ఫిలిప్స్, కొంగర సుదర్శన్ పాల్గొన్నారు.

## సాయి ఈశ్వరాచారి మృతి ప్రభుత్వ హత్యే

### సిరికొండ మధుసూదనాచారి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ, కాంగ్రెస్ పార్టీ మోసాన్ని తట్టుకోలేక ఆత్మబలిదానం చేసుకున్న బీసీ బిడ్డ సాయి ఈశ్వరాచారి త్యాగంపై మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రోజున హైదరాబాద్ జగద్గిరిగుట్టలోని ఈశ్వరాచారి ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి ఈశ్వరాచారి మృతదేహానికి పూలమాలలు వేసి గౌరవం ప్రకటించారు. అనంతరం వారు ఈశ్వరాచారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. బీసీల సమస్యల కోసం పోరాడిన అమరవీరుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, భవిష్యత్తులో వారికి భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## ముచ్చినిపర్తి సర్పంచ్‌గా ఇంగిలి రాజేందర్ ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండలంలోని ముచ్చినిపర్తి గ్రామానికి సర్పంచ్‌గా ఇంగిలి రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గ్రామ ప్రజల సహకారం, ఏకాభిప్రాయం మేరకు రాజేందర్ సర్పంచ్‌గా ఎన్నిక కాగా, ఆయనతో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఏకగ్రీవ ఎన్నిక ద్వారా ముచ్చినిపర్తి గ్రామ ప్రజలు తమ ఐక్యతను చాటుకున్నారు.

## ఆజంజాహి మిల్ కార్మిక భవనం స్థలంలో కొత్త భవనం నిర్మించాలి

### ● 16న నిరసన కార్యక్రమాలకు పిలుపు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** ఆజంజాహి మిల్ కార్మిక భవనాన్ని కూల్చివేసి ఏడాది పూర్తయిన సందర్భంగా, తదుపరి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కోసం కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు కాశిబుగ్గలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు కార్మిక వర్గానికి న్యాయం చేయాలని కోరుతూ పలు డిమాండ్లు, తీర్మానాలు చేశారు. కార్మిక భవన స్థలంపై వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూసీ) ఇచ్చిన నిర్మాణ అనుమతిని వెంటనే రద్దు చేయాలి. అదే స్థలంలో ప్రభుత్వం వెంటనే నూతన కార్మిక భవనం నిర్మించాలి. కార్మిక భవనం కూల్చివేతకు ఏడాది పూర్తయ్యే రోజున, అంటే డిసెంబర్ 16, 2025న, అదే స్థలంలో భారీ నిరసన కార్యక్రమాలను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆజంజాహి మిల్లుకు చెందిన స్థలంలోనే 318 మంది కార్మికులకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ టి.రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు సహా భూ పరిరక్షణ సొసైటీ అధ్యక్షులు పెరుమళ్ళ లక్ష్మణ్, ఆజం జాహిమిల్ గ్రూప్ కన్వీనర్ ఆకెన వెంకటేశ్వర్లు, కాశిబుగ్గ జేఏసీ కన్వీనర్ కొణతం కృష్ణ, ఎంసీపీఐయూ నగర కార్యదర్శి మాలోతు సాగర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు జనగం కుమారస్వామి, పౌరహక్కుల సంఘం నాయకులు కొంపెల్లి ప్రవీణ్, ఆజంజాహి మిల్ బదిలీ కార్మికుల సంఘం నాయకులు గుత్తికొండ రవి, అంకం వెంకటేశ్వర్లు, గద్దల శ్యాము, న్యూ డెమోక్రసీ నాయకులు అప్పారావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, అలాగే ఐఎఫ్‌టీయూ, మానవ హక్కుల సంఘం, ఏటీఎఫ్‌డీఎస్ తదితర సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండల కేంద్రంలోని పంచలింగాల శివాలయం ఆవరణలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు, హరిహర క్షేత్రం ప్రధాన అర్చకులు అనంతపద్మనాభయ శర్మ, అర్చకులు వెంకటేశ్వర్లు శర్మ, సంతోష్ శర్మ గురుస్వామి ల పర్యవేక్షణలో వేద మంత్రోచ్ఛారణలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరు మండల అయ్యప్ప స్వాముల బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహా పడిపూజకు ముందుగా, దీక్షాపరులు పంచలింగాల శివాలయంలో అయ్యప్ప స్వామికి పంచ అమృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప మాలధారణ దీక్షాపరులు అయ్యప్ప స్వామితో కలిసి నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు అడుగడుగునా మంగళ హారతులు, కొబ్బరికాయలు, పండ్లు, మంచినీటి బిందెలతో స్వామివారికి నీరాజనం సమర్పించారు. మేళ తాళాలు, భక్తి పాటలు, భజనలతో మాలధారణ దీక్షాపరులు ఎంతో భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తనలు నిర్వహించారు. పంచలింగాల శివాలయానికి చేరుకున్న అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృతాలు, గంధాభిషేకం, పన్నీరు, నారికేళ, కుంకుమ, బస్మాభిషేకాలు నిర్వహించారు. కూడ చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు తదితరులు అభిషేకం నిర్వహించారు. "స్వామియే శరణమయ్యప్ప... శరణు శరణు అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప" అంటూ భక్తుల నామస్మరణతో ఆత్మకూర్ అంతా మారుమోగింది. ఈ మహా పడిపూజలో ఆత్మకూరు మండలంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అయ్యప్ప మాలధారణ దీక్షాపరులు పాల్గొని అయ్యప్ప అనుగ్రహానికి పాత్రులయ్యారు. గురు స్వాములు శ్రీనివాస్ రెడ్డి, రేవూరి జయపాల్ రెడ్డి, కుక్కల చంద్రమోహన్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బయ్య పైడి కళ్యాణ్, బీజేపీ పరకాల నియోజకవర్గం కిసాన్ మోర్చా కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పలకల మంజుల, టీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు పాపని రవీందర్ తో పాటు పలువురు గురు స్వాములు, మాలధారణ స్వాములు, ఆత్మకూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాయి ఈశ్వర చారి ప్రాణ త్యాగం వృథా కాదు

### ◆ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మ బలిదానం చేసుకున్న సాయి ఈశ్వర చారి ప్రాణ త్యాగం వృథా కాదని, ఆయన ఆశయ సాధన కోసం బీసీలంతా ప్రభుత్వాలపైన పోరాడాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని టైలర్ స్ట్రీట్‌లో జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో దివంగత సాయి ఈశ్వర చారికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. నాడు శ్రీకాంతాచారి ప్రాణ త్యాగంతో తెలంగాణ సాధించుకుంటే, నేడు రెడ్డి, వెలమలు అధికారాన్ని కబ్జా చేసి 90% ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలను రాజకీయంగా అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, దేశాన్ని పాలిస్తున్న బీజేపీలు బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారనే మనస్థాపంతోనే సాయి ఈశ్వర చారి ఆత్మబలిదానం చేసుకున్నాడని ఆయన అన్నారు. సాయి ఈశ్వర చారి మృతికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలే నైతిక బాధ్యత వహించాలన్నారు. ఇది ముమ్మాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హత్యగానే బీసీ సమాజం పరిగణిస్తుందని, ఈ హత్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వర చారి మృతితోనైనా ప్రభుత్వాలు దిగిరావాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ నాయకులు పలు హెచ్చరికలు చేశారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగం ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చి, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును ఆమోదింప చేయాలి. తక్షణమే సర్పంచ్ ఎన్నికలను నిలిపివేయాలి. లేనిపక్షంలో బీసీ ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మహుతి చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి. సాయి ఈశ్వరాచారి ఆత్మ త్యాగంతోనైనా కాంగ్రెస్, బీజేపీ పార్టీలలోని బీసీ నేతలంతా తమ పదవులకు రాజీనామా చేయాలని కోరారు. బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, సాయి ఈశ్వరాచారి మృతిపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణకార సంఘ ఉపాధ్యక్షులు కొత్తగట్టు వీరబ్రహ్మాచారి, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండోట చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, కటుకోజ్వల సత్యనారాయణ, జక్కోజు కోటేశ్వర్ రావు, స్వర్ణకార సంఘం నాయకులు, కార్యకర్తలు పానుగంటి రవీందర్, ఆసం రవి, మధు, శ్రీను, శ్రీధర్, మనోజ్ కుమార్, శ్రీనివాస్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి పని చేయాలి

■ ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శనివారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కే.ఆర్.నాగరాజు, డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి హనుమకొండలోని డీసీసీ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్దగల విగ్రహానికి కూడా పూలమాలలు వేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్ జీవిత పోరాటం ప్రతి పౌరుడికి మార్గదర్శకం వంటిదని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం మన దేశానికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే గొప్ప విలువలను అందించింది. ఈ రాజ్యాంగ విలువలను కాపాడటం మనందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా పనిచేయడం ద్వారానే అంబేద్కర్ చూపిన దారిలో నడిచిన నిజమైన గౌరవం దక్కుతుందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నాయకులంతా కలిసి 'జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్' ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు విజయశ్రీ రాజాలీ, మామిండ్ల రాజుతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ మహనీయుడు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా దంపతుల ఆదేశం, నాయకత్వం మేరకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. 27వ డివిజన్‌లోని కూరగాయల మార్కెట్ బొడ్రాయి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించి, ఎన్నో సంస్కరణలు తెచ్చిన గొప్ప మేధావి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో మొదటి న్యాయశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 27వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పోలేపాక విశాల్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ భాషాపాక సదానందం, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనివాస్, సందెల లాజర్, జన్ను జీవన్, కొమ్ము శ్రీధర్, నర్మెట్ట చిన్న, కొగిల యాకూబ్, సిలువేరు చిన్న, దౌడు నాగరాజ్, మురహరి సుదర్శన్, బూర సురేష్, బుర్రి సంజీవ, శ్యామల మార్క్, ఎలగొండ శ్రీనివాస్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ మేధావి, భారత రత్న, నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను శనివారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు "మనువాదుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని" పిలుపునిచ్చారు. మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అంకెశ్వరపు రామచందర్ రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంకెశ్వరపు రామచందర్ రావు, వీసీకే రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట రవి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే అంబేద్కర్ గారికి అసలైన నివాళి అని అన్నారు. స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేస్తూ, దేశంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ సబండ వర్గాల ప్రజలందరికీ హక్కులు కల్పించిన మహనీయులు అంబేద్కర్ అని గుర్తుచేశారు. ఈరోజు అంబేద్కర్ పరమపదించిన రోజు అంటే బహుజన ప్రజలు అంధకారంలోకి వెళ్లిన రోజని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, హక్కుల కోసం నిరంతరం పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు, డీవీఎంసీ సభ్యులు సింగారపు రవి ప్రసాద్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్, గౌసంగి కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మంద మల్లేశం, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్, టీజీవీపీ రాష్ట్ర నాయకులు మేడ రంజిత్, నాయకులు శ్రీనివాస్, కుమార్, అనిల్, రాజు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగుల రాజ్యాధికార సాధనకు పోరాడాలి

• తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావు అంబేద్కర్ ఆశయాల సాధనకు బహుజనులంతా నిరంతరం పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వరంగల్ జగదాంబ సెంటర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రాములు ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా నేటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల బాధలు తీరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాధికారం అగ్రవర్ణాల చేతిలో బందీ కావడం వల్లే బడుగుల జీవితాల్లో మార్పు రావడం లేదని విమర్శించారు. బహుజనులు చైతన్యంతో సంఘటితమై, రాజ్యాధికారాన్ని సాధించే దిశగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. పాలకవర్గాల విధానాలతో ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతోందని, ఈ క్లిష్ట సమయంలో లౌకిక ప్రజాస్వామ్య రక్షణకు ప్రతిన బూనాలని వెంకట్రాములు కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, అమ్ముకోకుండా వివేచనతో వినియోగించుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఆశించిన సమ సమాజ సాధన కోసం పోరాటాలు నిర్వహించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు చేలుకల రాజు, అలకుంట్ల గణేష్ రాజు, ఏనుగు శైలజ, తురక పద్మ, వంశరాజు సంఘం జిల్లా అధ్యక్షులు ఎలీషా, ప్రధాన కార్యదర్శి చిందం వెంకన్న, సహాయ కార్యదర్శి లింగయ్య, ప్రేమ కుమార్, లింగమ్మ, ఈశ్వర తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు చిరస్మరణీయం



**వరంగల్ వాయిస్, పరకాల:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పరకాల పట్టణ కేంద్రంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోదా రామకృష్ణ మాట్లాడుతూ.. దళిత, బలహీన వర్గాల వికాసం కోసం, సమసమాజ స్థాపన కోసం పోరాటమే జీవితంగా మార్చుకున్న మహోన్నత త్యాగశీలి డాక్టర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో పరకాల మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గోవింద్ సురేష్, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, బొచ్చు జెమిని, మునిగంటి విష్ణువర్ధన్, పసుల శ్రీనివాస్, ఇంగిలి వీరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనలో సాగుదాం

బీజేపీ నేత ఆడెపు వెంకటేష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా వరంగల్ నగరంలోని చింతల్ ప్రాంతంలో శనివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఆడెపు వెంకటేష్ మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. న్యాయకోవిదుడు అయిన ఆయన భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ముఖ్యంగా, తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటుకు అంబేద్కర్ ముందు చూపే కారణమని ఆయన స్పష్టం చేశారు. కొంతమంది బీజేపీ నాయకులు మరియు అంబేద్కర్ కాలనీ వాసులతో కలిసి ఈ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ మునుపటి ఎల్లయ్య, రజియా సుల్తానా, దుస్స శ్రీధర్, శాఖమూరి నవీన్, ఆకారపు శేఖర్, బంక రాజ్‌కుమార్, సిద్ధ రాజు, జోగు మధుతో పాటు అంబేద్కర్ కాలనీ వాసులు పసునూరి సుధాకర్, గద్దెల కుమార్, కుమ్మరి రజినీకాంత్, ఈదుల నిర్మల, తొగరు రమేష్, శైలేంద్ర కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ పోరాటం మార్గదర్శకం



**వరంగల్ వాయిస్, సుబేదారి:** బీఆర్.అంబేద్కర్ సేవలు, ఆయన జీవిత పోరాటం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుసా సుధీర్ అన్నారు. ఆయన 69వ వర్ధంతి సందర్భంగా శనివారం వరంగల్ బార్ అంబేద్కర్ హాల్‌లో ఆయన చిత్రపటానికి, విగ్రహానికి వలుసా సుధీర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి అందించిన అంబేద్కర్ సేవలను కొనియాడారు. బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని ఆయన స్మరించుకున్నారు. న్యాయవాదులు అల్లం నాగరాజు, శామంతుల శ్రీనివాస్, ఆనంద్ మోహన్, జైపాల్, శశిరేఖ, సురేష్, గునిగంటి శ్రీనివాస్, బొమ్మ నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను సాధించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బరుపట్ల కిరీటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, పలువురు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ పాక్స్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ (ఉత్తమ అవార్డు గ్రహీత) పర్వతగిరి రాజు, మండల కాంగ్రెస్ నాయకులు జలందర్ రెడ్డి, సంగే మహేందర్, ఆత్మకూరు కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు తనుగుల సందీప్, మండల ప్రధాన కార్యదర్శి వెల్డ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు గ్రామ అధ్యక్షులు బయ్యా కుమారస్వామి, చిమ్మని దేవరాజు, అలవాలా రవి, కాదబోయిన రవి, గుండెబోయిన శ్యాం, సంగే రాజు, మంతుర్తి రవి, జన్ను కోఠి, నాగేల్లి స్వామి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గణపురంలో..



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రపంచ మేధావి, భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు గణపురం మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి 'జై భీమ్' నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్క సంపత్, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్, వ్యవసాయ శాఖ మార్కెటింగ్ జిల్లా ఉపాధ్యక్షులు రేపాక రాజేందర్, మార్కెటింగ్ డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మాజీ ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్, బొట్లపాటి నాగేశ్వరరావు, సాధన రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆరు మూల ఎల్ల స్వామి, మండల నాయకులు దూడపాక దుర్గయ్య, చిలువేరు ఉదయాకర్, దూడపాక పున్నం, మూల రఘు, దూడపాక అఖిల్, ఆరు మూల ప్రభాకర్, జన్న ప్రశాంత్, తిరుపతి, ఉపాధ్యాయులు భరత్ కుమార్ సహా పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆదర్శప్రాయుడు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీం రావ్ అంబేద్కర్ జీవితం, ఆశయాలు నేటి తరానికి, యువతకు ఆదర్శప్రాయమని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) ఉపకులపతి (వీసీ) ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు. డాక్టర్ భీం రావ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం కేయూ ఆడిటోరియం ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం తో పాటు, పాలక మండలి సభ్యులు డాక్టర్ బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ కే.అనితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు కూడా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# సర్పంచ్ ఎన్నికల్లో పద్మశాలీలు సత్తా చాటాలి

- ఎక్కువ సర్పంచ్ స్థానాలు మనవే కావాలి
- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 11న జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో బరిలో నిలిచిన పద్మశాలి అభ్యర్థులు సత్తా చాటాలని, అత్యధిక స్థానాలను గెలుచుకుని పద్మశాలి బలాన్ని సమాజానికి ఎలుగెత్తి చాటాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం పిలుపునిచ్చారు. పద్మశాలీలంతా ఐక్యతగా ఉంటూ తమ అభ్యర్థుల గెలుపుకు బాట వేయాలని ఆయన కోరారు. శనివారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని దేశరాజుపల్లి, ఉప్పులపల్లి, గోపాల్పూర్ గ్రామాల్లో పద్మశాలి సంఘం కమలాపూర్ మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం



నేతలు, పద్మశాలి అభ్యర్థులు మిట్టపల్లి మహేశ్వరి కుమారస్వామి, గాజుల శ్రీనివాస్, మామిడాల కళ్యాణి అశోక్ ల తరపున ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. పద్మశాలి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం పద్మశాలి కులస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన బచ్చు ఆనందం.. సర్పంచ్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి, పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శులు వైద్యం రాజగోపాల్, తవుటం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, మండల కార్యదర్శి మిట్టపల్లి ప్రభాకర్, మండల నాయకులు మెండు రమేష్ సహా పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్ హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

## రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత 3 నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ పరిస్థితిపై ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు వంటి కొంతమంది సిబ్బందికి రెండు నెలల వేతనాలు విడుదల చేసి, మిగిలిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అకౌంటెంట్లు, పబ్లిక్ హెల్త్ మేనేజర్లు, మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కాంటిజెంట్ వర్కర్లు, బస్తీ దవాఖాన ఉద్యోగులు సహా దాదాపు 33 జిల్లాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు నిలిపివేయడం ఉద్దేశపూర్వక వివక్ష అని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వేతనాలు అందక దసరా, దీపావళి పండుగలను కూడా కుటుంబాలతో ఆనందంగా జరుపుకోలేకపోయినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. తమ డిమాండ్లు నెరవేరకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. డిసెంబర్ 11 నుంచి విధులకు హాజరై సేవలు నిలిపివేస్తున్నామని, డిసెంబర్ 20 నుంచి పూర్తి స్థాయిలో గైర్హాజరు కానున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి

## బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తి రెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాయంపేట మండలం వసంతపూర్ గ్రామంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా నాయకులు లాడే శివ, బూత్ అధ్యక్షులు చల్ల ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. కొత్తగా చేరిన నాయకులకు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏడునూతుల నిషిధర్ రెడ్డి, భుజంగరావు, లక్ష్మి, వినోద్, సుమన్, ప్రకేష్, అశోక్, ప్రసాద్, శివ, రాజు, జనార్దన్, శశికుమార్, చారి, రాజు, ప్రదీప్, నాగరాజు, సాయికిరణ్, ప్రదీప్, అజయ్, పవన్, లక్ష్మణ్, రాజు, విజయ్ తదితరులు బీజేపీలో చేరారు. రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ రాయరాకుల మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడికొండ రవి కిరణ్, మండల అధ్యక్షుల నరహరిశెట్టి రామకృష్ణ,మండల ప్రధాన కార్యదర్శిలు మామిడి విజయ్ తిరుపతి నాయకులు ఉప్పు రాజు, చల్ల రఘుపతి రెడ్డి, ఎర్ర రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాలల జోనల్ వార్షిక క్రీడోత్సవాలు

**వరంగల్ వాయిస్, కడిపికొండ/ కాజీపేట:** తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థలు (వరంగల్ జోన్) జోనల్ స్థాయి క్రీడోత్సవాలు కాజీపేట సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య ఈ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మడికొండ ఎస్.ఐ. రాజ్ కుమార్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. వరంగల్ జోన్‌లోని అన్ని బ్రాంచీల నుండి దాదాపు 1000 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఈ క్రీడలు పరిష్కరించే మార్గాన్ని సూచిస్తాయని వివరించారు. డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాలుగా సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి ఇలాంటి వార్షిక ఆటల పోటీలు నిదర్శనమని అన్నారు. నేటి యాంత్రిక జీవితంలో చదువులకే పరిమితమవుతున్న విద్యార్థులకు ఇలాంటి ఆటలు ఉత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మడికొండ ఎస్ఐ.రాజ్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులలో



విజయం పట్ల అభిరుచిని పెంచుతూ, వారి మధ్య ఐక్యతకు ఈ పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ క్రీడోత్సవాల్లో విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, కో-కో, త్రోబాల్, చెస్, క్యారమ్స్, మరియు 100 మీటర్ల రన్నింగ్ వంటి వివిధ క్రీడలలో పోటీ పడతారని నిర్వాహకులు తెలియజేశారు. గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం అతిథులు జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం చేతన్ మాదుర్, అకడమిక్ కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, కాజీపేట శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ అనితా రెడ్డి, వరంగల్ జోన్ ఇతర బ్రాంచీల ప్రిన్సిపాల్స్ సురేఖ, శృతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత.. !!



ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో–ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడిరచింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇంస్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ – గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో–ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడిరది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.

# ధనుష్ 100 కోట్ల మార్క్



బాక్స్ ఆఫీస్ దగ్గర హిందీలో చాలా టైం తర్వాత మంచి బజ్ తో వచ్చిన కోలివుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన హిందీ సినిమా తేరే ఇష్క్ మే సినిమా డీసెంట్ రివ్యూలను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా మంచి జోరుని చూపెడుతూ ఉండగా సినిమా ఓవరాల్ గా వర్కింగ్ డేస్ లో కూడా మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండగా 5 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 69.35 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకోగా 6వ రోజున వర్కింగ్ డే లో మరోసారి ఎక్స్ లెంట్ గా హోల్డ్ ని చూపించిన సినిమా% 6.89 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకుంది ఇక టోటల్ గా 6 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 76.24 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా డబ్ వర్షన్స్ తో కలిపి సినిమా 79.75 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా ఇండియాలో గ్రాస్ 93 కోట్ల రేంజ్ లో సొంతం చేసుకుంది. ఇక సినిమా ఓవర్సీస్ లో 1 మిలియన్ రేంజ్ లో వసూళ్ళని అందుకోగా ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఇప్పుడు 6 రోజుల్లో సాధించిన కలెక్షన్స్ తో 100 కోట్ల మార్క్ ని దాటేసి మాస్ రచ్చ చేయడం విశేషం.ధనుష్ కెరీర్ లో హిందీ లో ఇవి సెన్సేషనల్ కలెక్షన్స్ అని చెప్పాలి.

# నా పేరు చెప్పగానే ఒప్పుకున్నారు

ఒకప్పుడు వరుస సినిమాలు, హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ డైరెక్టర్ రేసులోకి దూసుకొచ్చారు వి.సముద్ర. టాలీవుడ్ యాంగ్రీ యంగ్‌మెన్ డాక్టర్ రాజశేఖర్ హీరోగా వచ్చిన సింహరాశి సినిమాతో దర్శకుడిగా పరిచయమైన సముద్ర.. తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకోవడంతో పాటు రాజశేఖర్‌కు తిరుగులేని హిట్ అందించారు. ఈ విజయంతో సముద్రకు అవకాశాలు క్యూకట్టాయి. ఆ తర్వాత శివరామరాజు, టైగర్ హరిశ్చంద్రప్రసాద్, సూర్యం, మహానంది, విజయదశమి, ఏవడైతే నాకెంటీ, అధినేత, పంచాక్షరి, సేవాకుడు తదితర చిత్రాలను తెరకెక్కించారు. కానీ దురదృష్టవశాత్తూ వీటిలో చాలా సినిమాలు డిజాస్టర్ కావడం, యంగ్ టాలెంట్ రాకతో వి.సముద్రని తెలుగునాట పట్టించుకునేవారే కరువయ్యారు. ఇటీవల వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్న ఆయన తాజాగా ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ పంచాక్షరి సినిమా సమయంలో కింగ్ అక్కినేని నాగార్జునపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సముద్ర. అనుష్క అరుంధతి చేశాక ఎవరికీ చేయలేదు, డేట్స్ ఇవ్వలేదు. చంద్రకి (నాగార్జున పర్సనల్ మేకప్‌మెన్) మాట ఇచ్చింది. చంద్రకు ఇండస్ట్రీలో చాలామంది దర్శకులతో పరిచయాలు ఉన్నాయి. నేను డైరెక్టర్ అయ్యాక సినిమాలు చేస్తుండగా.. సముద్రని పెట్టుకోమని చంద్రకి నాగార్జున గారు చెప్పారు. అయితే సముద్రని ఒకసారి నన్ను కలవమను అని చెప్పారట. వీడి లైఫ్ జాగ్రత్త.. అంత బడ్జెట్ పెట్టించకుండా, ఇబ్బంది పెట్టకుండా జాగ్రత్తగా చేయ్.. ఏదైనా ఇబ్బంది ఉంటే నాతో చెప్పు అని ఈ ఒక్క మాటే చెప్పారు.






# ముందు వాళ్లకి సెటిల్ చెయ్

'అఖండ 2' రిలీజ్ సమస్యల మధ్య బండ్ల గణేష్ మాట్లాడిన పాత వీడియో మళ్లీ వైరల్ అవుతోంది. ఎప్పుడూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే గణేష్, రామ్ చరణ్‌పై ఒక సంఘటనను గుర్తుచేశారు. గోవిందుడు అందరివాడేలే విడుదలకు ముందు భారీ బకాయిలతో ఇబ్బంది పడుతున్నప్పుడు, రామ్ చరణ్ తన రెమ్యూనరేషన్ కంటే ముందుగా "ముందు సినిమా రిలీజ్ అయ్యేలా చూసుకో, నా విషయం తర్వాత చూద్దాం" అంటూ ధైర్యం చెప్పాడని తెలిపారు. అఖండ 2 ఆర్థిక వివాదాలు నడుస్తున్న సమయంలో ఈ వీడియో వెలుగులోకి రావడంతో టాలీవుడ్‌లో పెద్ద చర్చకు దారితీసింది. టాలీవుడ్‌లో నిర్మాతగా, రాజకీయ కార్యకర్తగా, సోషల్ మీడియాలో తన బహిరంగ వ్యాఖ్యలతో ఎప్పుడూ హైలైట్ అవుతూ ఉండే పేరు బండ్ల గణేష్ . ఆయన మాట్లాడితే వివాదం రావడం సహజంగా మారిపోయింది. క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో చిత్రాల్లో నటించిన ఆయన 'గబ్బర్ సింగ్' ద్వారా స్టార్ ప్రొడ్యూసర్‌గా మారారు. ఆ తర్వాత చేసిన కొన్ని సినిమాలలో ఎదురైన సమస్యలు, ఆర్థిక వివాదాలు తరచూ ఆయన పేరును హాట్ టాపిక్‌గా మార్చాయి. తాజాగా 'అఖండ 2' సినిమా విడుదల సమస్యల నేపథ్యంలో బండ్ల గణేష్ చెప్పిన ఒక పాత సంఘటన మళ్లీ వైరల్ అవుతోంది. రామ్ చరణ్ గురించి ఆయన చెప్పిన సంగతులు సోషల్ మీడియాలో పెద్ద చర్చనీయాంశం అయ్యాయి. ఇటీవల అఖండ 2 విడుదలకు గంట ముందు షోలు రద్దు కావడం, ప్రొడ్యూసర్స్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీల సమస్యలు బయటపడటం సినీ పరిశ్రమను కుదిపేశాయి. చిన్న సినిమాలే కాకుండా స్టార్ హీరో బాలకృష్ణ చిత్రం ఇలాంటి సమస్యల్లో పడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా కాపీ ఇప్పటికే థియేటర్లకు చేరినా, సమస్యలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టడం చూసి ఇండస్ట్రీలో నిర్మాతలు ఎదుర్కొనే కష్టాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఇదే సమయంలో బండ్ల గణేష్ గతంలో ఓ ఇంటర్వ్యూలో రామ్ చరణ్ గురించి చెప్పిన సంఘటన హైలైట్ అయింది.



# పెరిక కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రతి జిల్లాకు ఒక ఆత్మగౌరవ భవనం
- పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాధాకృష్ణ
- వరంగల్, హనుమకొండ జిల్లాల నూతన కమిటీ ఎన్నిక

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సామాజిక రంగాల్లో పెరిక కులస్తులు అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తెలంగాణ పెరిక కుల రాష్ట్ర కమిటి కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆక రాధాకృష్ణ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రం పెరిక వాడ ప్రతాపరుద్ర ఫంక్షన్ హాల్ లో దిడ్డి నరేందర్ అధ్యక్షతన జరిగిన వరంగల్, హనుమకొండ జిల్లాల పెరిక కమిటి ఎన్నిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయ రంగంలో బీసీ వాటా కోసం జరిగే పోరాటంలో పెరిక కులస్తులను ముందుంచుతామని రాష్ట్ర ముఖ్య సలహాదారు చింతం లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

**వరంగల్ జిల్లా కమిటీ..**

వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం ముఖ్య సలహాదారుగా దిడ్డి నరేందర్, అధ్యక్షుడిగా అచ్చ వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చింతం యాదగిరి, గౌరవ అధ్యక్షులుగా బొలుగొడ్డు శ్రీనివాస్, కోశాధికారిగా బేరె శంకర్, ఉపాధ్యక్షులుగా బేరి శరత్, బిళ్ళ కిషోర్, అక్కల రమేష్, ప్రచార కార్యదర్శిగా పోతరాజు రాజేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నంద్రె అమర్, సంయుక్త కార్యదర్శిగా బొలుగొడ్డు ప్రభాకర్, న్యాయ సలహాదారుగా బరుపటి రవిరాజు, మీడియా ప్రతినిధిగా ముద్దసాని శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా సుంచు జగదీష్, కానుగంటి రాజు, బేర కిషన్, బిల్లా రమేష్, గౌరవ సలహాదారుగా సుంచు కట్టమల్లులను ఎన్నుకున్నారు.

**హనుమకొండ జిల్లా కమిటీ..**

హనుమకొండ జిల్లా పెరిక సంఘం అధ్యక్షులుగా న్యాయవాది, సామాజిక ఉద్యమకారులు సాయిని నరేందర్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బోల్ల వీరప్రతాప్, ఉపాధ్యక్షులుగా వనపర్తి రాజన్న, కెత్తె రవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా అచ్చ పరమేశ్వర్, కోశాధికారిగా పూజారి జితేందర్, ప్రచార కార్యదర్శిగా ఆడిటర్ పూజారి సత్యనారాయణ, కార్యదర్శులుగా సంగని సాంబయ్య, ఆక జగదీష్, ప్రచార కార్యదర్శిగా అప్పని వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు.

కొత్తగా ఎన్నికైన రెండు జిల్లాల కమిటీ నాయకులకు ప్రొఫెసర్ వడ్డె రవీందర్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు చింతం లక్ష్మీనారాయణ, డాక్టర్ సంగని మల్లేశ్వర్, పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి ముత్తయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లక్కర్సు ప్రభాకర్ వర్మ, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ధనేకుల కృష్ణ, ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి రంగారావు, కర్రె సురేందర్, అసోసియేట్ అధ్యక్షులు సంగని





హరికిషన్, కోట మల్లికార్జున్, ఆర్థిక కార్యదర్శి బోడకుంటి సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బుయ్యాని శివకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పని సతీష్, ములుగు జిల్లా అధ్యక్షులు పల్నాటి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకు చిడెం మోహన్ రావు, దిడ్డి మోహన్ రావు, గంప నాగరాజు, నట్టే మోహన్ రావు, కానుగంటి శ్రీనివాస్, అప్పని మాధవరావు, చింతం రమేష్, మీశెట్టి రాజేశ్వర్ రావు తదితరులు అభినందనలు తెలిపారు.

# ఐజేయూ నేతలకు ఘన సత్కారం

**సత్కరించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతనంగా ఎన్నికైన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) నేషనల్ కౌన్సిల్ సభ్యులు, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల ఐజేయూ జాతీయ కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టులు గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, తోట సుధాకర్, సంగోజు రవి, టీయూడబ్ల్యూజే ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం రాంచందర్, మట్ట దుర్గాప్రసాద్ లకు మెమోంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. యూనియన్ కు విశేష సేవలందించి నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేసుకున్న నల్లాల బుచ్చిరెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్యలు మాట్లాడుతూ.. యూనియన్ బలోపేతం కోసం పనిచేస్తున్న నేతలకు పదవులు రావటం అభినందనీయమన్నారు. ఐజేయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.విరహత్ అలీ, రాంనారాయణ నాయకత్వంలో రాష్ట్రంలో జర్నలిస్టుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న యూనియన్ టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమే అన్నారు. క్లబ్ లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షుడు కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు ఎండీ నయీంపాషా, విజయరాజ్, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, నేతలు సోమనర్సయ్య, రాజేంద్రప్రసాద్, సంపత్ రావు, పాషా తదితరులు పాల్గొన్నారు.



# స్కిల్ డెవలప్ మెంట్ లో పవర్- బీఐ కీలకం

□ ఎన్నారై నవకిరణ్ దండు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఐటీ రంగంలో రాణించాలంటే పవర్–బీఐ టూల్ ఎంతో కీలకమైందని ఎన్నారై నవకిరణ్ దండు తెలిపారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ కామర్స్ సెమినార్ హాల్లో ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థులకు బిజినెస్ స్కిల్స్ పై శనివారం ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ లాంటి ప్రధాన కంపెనీల్లో ఉద్యోగ మెళకువలపై నవ కిరణ్ అవగాహన కల్పించారు. సరైన స్కిల్స్ లేకుండా ఉద్యోగాలు సాధించలేమన్నారు. వివిధ కంపెనీలలో రాణించాలంటే స్కిల్స్ డెవలప్ చేసుకోవాలన్నారు. వివిధ ఐటీ కంపెనీలు ఏ విధమైన స్కిల్స్, టూల్స్ ఉపయోగిస్తారు అనే వాటిపై ఉదాహరణలో విద్యార్థులకు నవకిరణ్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు తగిన సమాచారం, అవగాహన కల్పించారు. ఈ వర్క్ షాప్ లో కేయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వరలక్ష్మి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, అండ్ ప్రిన్సిపల్, యూసీసీబీఎం ప్రొఫెసర్ అమరవేణి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నర్సింహచారి, అసోసియాటి ప్రొఫెసర్ పనింద్రకుమార్ లతో పాటు సుమారు 350కి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.




# హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

- శాంతి భద్రతల పరిరక్షణలో వారిది ప్రత్యేక పాత్ర
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డ్స్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం 63వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ నిర్వహించిన పరేడ్ ఆహ్వానితులతో పాటు పోలీస్ అధికారులకు అకర్షణగా నిలిచింది. అనంతరం విధినిర్వహణలో రాణించిన హోంగార్డులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. క్రీడల్లో రాణించిన వారికి సీపీ బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హోంగార్డ్స్ పోలీస్ శాఖకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా మన తెలంగాణలో హోంగార్డ్ సిబ్బంది అత్యధిక గౌరవ వేతనం అందించడంతో పాటు, ట్రాఫిక్ పోలీసులతో సమానంగా ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించే హోంగార్డ్స్ కు 30శాతం అదనపు వేతనం, పరేడ్ అలవెన్సు వంద రూపాయల నుంచి రెండు వందల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమములో డీసీపీలు అంకిత్ కుమార్, కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ తో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com